క్లుప్తంగా

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

కురవి: అనారోగ్యానికి తోడు అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది కాగితపు విశ్వకర్మచారి (55) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై బి.గోపి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన కాగితపు విశ్వకర్మ చారీ గ్రామంలో డిష్ నడిపిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో అనారోగ్యానికి గురయ్యాడు. దీనికి తోడు అప్పులు సైతం పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని గ్రామ పంచాయతీకి చెందిన నల్లాల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతుడి భార్య విజయమాధూరి ఫిర్యాదు మేరకు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు మేఘన, దీపిక, లావణ్య ఉన్నారు.

ఎంపీటీసీపై గొడ్డలితో దాడి



కొత్తగూడ: కొత్తగూడ మండలం కార్లాయి గ్రామానికి చెందిన బత్తులపల్లి ఎంపీటీసీ సభ్యుడు పెన్క వెంకన్నపై అదే గ్రామానికి చెందిన దారం సందీప్ అనే వ్యక్తి అర్ధరాత్రి గొడ్డలితో దాడి చేశాడు. ఎస్సై దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత గొడవలు మనసులో పెట్టుకుని దాడికి పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అదుపు తప్పి చేపల లారీ బోల్తా



దంతాలపల్లి: అదుపు తప్పి చేపల లారీ బోల్తా కొట్టిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. గుడివాడ నుంచి అలహాబాద్‌కు చేపల లోడుతో వెళ్తున్న లారీ మండల కేంద్రం పత్తి మిల్లు సమీపానికి చేరుకోగానే అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయింది. లారీలో నుంచి కొన్ని చేపలు పడిపోవడంతో కొంత మంది చేపలు తీసుకెళ్లడానికి ప్రయత్నం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఈ ఘటనలో డ్రైవర్ కొడారి లాజర్, క్లీనర్ కొప్పినేని కోటేశ్వర రావుకు స్వల్ప గాయాలు అయ్యాయి, వారిని చికిత్స నిమిత్తం ఓ ఆస్పత్రికి తరలించారు.

రైలునుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో గురువారం రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం తిరుపతి వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ డోర్నకల్ రైల్వేస్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగుతున్న సమయంలో 48 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి ప్లాట్‌ఫాం దిగుతుండగా జారి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. 108 సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఖమ్మం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

దంతాలపల్లి: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బొడ్లాడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన కట్ల బాబు, ఉమ దంపతుల కుమారుడు వంశీ(19) పదో తరగతి వరకు చదివాడు. కొన్ని సంవత్సరాల నుంచి వంశీకి ఆరోగ్యం బాగాలేదు. ఎన్ని డబ్బులు ఖర్చు చేసిన జబ్బు నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై వంశీ సోమవారం సాయంత్రం కలుపు నివారణ మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వంశీ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా?

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామం నుంచి రామానుజాపురం వెళ్లే దారిలో నల్ల చెరువు కట్టపై రోడ్డు గుంతలతో అస్తవ్యస్తం మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు , ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కింద పొలాలు ఉన్న రైతులు పొలాలకు ఎరువులు తరలించాలంటే నరకయాతన పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు ఉంది. ఈ కట్ట పరిస్థితిని గమనించిన గ్రామానికి చెందిన కందిమల భరత్ బాబు 2004లో అప్పటి చెన్నూరు ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాస్‌రావు చొరవతో, పనికి ఆహార పథకంలో భాగంగా రూ.3లక్షల వ్యయంతో కట్టకు ఇరువైపుల చెట్లను తొలిగించి, కట్టపై కంకరపోసి మరమ్మతులు చేయించారు. ఇదే కట్టపై 2022లో అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ రూ.5లక్షలు మంజూరు చేయించి, కట్టపై తారురోడ్డు వేయించాడు. కాలక్రమంలో రోడ్డుపై గుంతలు ఏర్పడినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెరువు కట్టకు మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.



గుంతలతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించండి

మహబూబాబాద్ అర్బన్/మరిపెడ: వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఉపఎన్నికలు ఈనెల 27న జరగనున్న క్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు చెంప పెట్టులాంటి తీర్పును పట్టభద్రులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ, జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య, నాయకులు లక్ష్మణ్‌రావు, ఆకుల శ్రీనివాస్, పైండ్ల శ్రీనివాస్, వెంకటచారి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గార్ల: ప్రేమేందర్‌రెడ్డికి పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విమల్‌కుమార్‌జైన్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమణి, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు జంపాల శ్రీను పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేందర్ రెడ్డి కోరారు. మండలంలోని కంబాలపల్లి, నడివాడ గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు.



మహబూబాబాద్ అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కొమ్మాల్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు మారగాని రాజుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నెల్లుట్ల సతీష్, లక్ష్మణ్ రావు, రంగారెడ్డి పాల్గొన్నారు.

డోర్నకల్: గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడుదేవానాయక్ కోరారు. గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మినారాయణ, జయరాజ్, రెహమాన్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ప్రేమేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, జిల్లా నాయకుడు చెల్పూరు వెంకన్న కోరారు. గురువారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, కోమల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేష్, శ్రీశైలం, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి



కేసముద్రం: మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్, శంకర్‌నాయక్

కేసముద్రం: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో పార్టీ ముఖ్యనాయకులు, బూత్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, నీలం దుర్గేష్, శ్రీను, యాకుబ్‌రెడ్డి, హరీశ్‌నాయక్, చిర్రయాకాం తంగౌడ్ పాల్గొన్నారు.

కొత్తగూడ: విద్యావంతుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆసీఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి కోరారు. మండల కేంద్రంలో పట్టభద్రులతో మాట్లాడారు. విద్యావంతుల సత్తా చాటుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

పెద్దవంగర: రాకేశ్‌రెడ్డి గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య గురువారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించాడు. మండల అధ్యక్షుడు దేశెట్టి వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న రూ.5వేల అప్పగింత



బాధితురాలికి డబ్బులు అందజేస్తున్న విజయవెంకటేశ్ దంపతులు

కేసముద్రం: రోడ్డుపై ఓ మహిళ రూ.5వేలను పోగొట్టుకోగా, ఆ పర్సు ఓ చికెన్‌షాప్ యజమానికి దొరకడంతో బాధిత మహిళకు డబ్బులను అప్పగించి నిజాయితీ చాటుకుంది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని బనిషెట్టి చికెన్‌బజార్ షాపునకు, ఇదే మండలం అమీనాపురం గ్రామానికి చెందిన సుస్మిత అనే మహిళ చికెన్ కోసం వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో షాపునకు కొంతదూరంలో రోడ్డుపై తన పర్సును పొగొట్టుకుంది. పర్సులో రూ.5వేలు ఉన్నాయి. కాగా చికెన్‌షాపు యజమాని బనిషెట్టి విజయ అటుగా వెళ్తుండగా రోడ్డుపై పడిన పర్సును గుర్తించింది. వెంటనే చికెన్ షాపులో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా పర్సు పొగొట్టుకున్న మహిళను గుర్తించారు. దీంతో ఆమెకు సమాచారం అందించి పొగొట్టుకున్న రూ.5వేలను బనిషెట్టి విజయ, వెంకటేష్ దంపతులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు సమక్షంలో అప్పగించారు. దొరికిన డబ్బులను తిరిగి అప్పగించిన బనిషెట్టి విజయ, వెంకటేష్ దంపతులను స్థానికులు అభినందించారు.

పోగొట్టుకున్న ఫోన్..

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని కృష్ణ కాలనీకి చెందిన సోమేశ్వర్ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఫోన్ సాయికిరణ్ అనే యువకుడికి దొరుకగా రూరల్ ఎస్సై వి.దీపిక రెడ్డి సమక్షంలో బాధిత వ్యక్తికి గురువారం అప్పగించాడు.

కాంగ్రెస్ గెలిస్తేనే పట్టభద్రులకు న్యాయం



తొర్రూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



గూడూరు: సమావేశంలో మాట్లాడుతున్న కపిలవాయి దిలీప్‌కుమార్

తొర్రూరు రూరల్: శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిస్తేనే పట్టభద్రులకు తగిన న్యాయం జరుగుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని రామ ఉపేందర్ గార్డెన్‌లో ప్రచార కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలసి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్‌రెడ్డి, హరిప్రసాద్‌రావు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న

గార్ల: ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించాలని గురువారం గార్ల మండలంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యను ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ బట్టు నాగరాజు, మండల అధ్యక్షుడు రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్‌మల్లన్న కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్లతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జన సమితి జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గూడూరు: తీన్మార్ మల్లన్న గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ కపిలవాయి దిలీప్‌కుమార్, ఏఐసీసీ సభ్యుడు పీసీసీ స్పోర్ట్స్ పర్సన్ కత్తి వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, పాల్గొన్నారు.

కేసముద్రం: తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, టీజేఎస్ మండల అధ్యక్షుడు బాణాల నాగరాజు కోరారు.

మల్లన్న గెలుపునకు కృషి

నెల్లికుదురు సెంటర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సీపీఎం, సీపీఐ మద్దతు తెలుపుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి తెలిపారు.

ధైర్యంతో ముందుకు సాగాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

గార్ల: జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ముందుకు సాగాలి కాని ఆత్మహత్యలకు పాల్పడవద్దని తహసీల్దార్ కుసుమ రవీందర్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల సమాజం స్వాంతన చేకూర్చి వారిలో మానసిక ధైర్యాన్ని నింపాలని సూచించారు. తనకు ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ 10 ఏళ్లుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటి వరకు 28 మంది ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. ఈ సదస్సులో ఎంపీడీఓ మంగమ్మ, డీటీ సుధాకర్, రాంబాబు, ఉష, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌కు మరమ్మతు చేయించాలి

దంతాలపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామంలో చెక్‌డ్యాం నిర్మాణం పూర్తి చేయాలని రైతులు డీఈ వినయ్‌కుమార్‌ను కోరారు. గురువారం డీఈ చెక్‌డ్యాంను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడారు. వేములపల్లి, రేపోణి గ్రామాల మధ్య ఉన్న వాగుపై చెక్‌డ్యాం గత సంవత్సరం వర్షాలకు తెగిపోయిందన్నారు. గ్రామానికి చెందిన కుర్యాల కృష్ణయ్య, మరికొంత మంది రైతులు మరమ్మతులు చేయించాలని సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. అయిన వారు పట్టించుకోలేదన్నారు. యాసంగి పొలం నాటు వేయలేని పరిస్థితి అని రైతులు తెలిపారు. వేసవి కాలం రావడంతో ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలుమార్లు తిరిగిన స్పందన లేదన్నారు. ఇప్పటికైన చెక్‌డ్యాంకు మరమ్మతుల చేయించాలని రైతులు డీఈ, ఏఈ మౌనికలను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న డీఈ

ఘనంగా లక్ష్మీనారాయణుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు

గూడూరు: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి తిరు కల్యాణోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి బాలభోగము, బలిహరణము, భేరిపూజ, దేవతాహ్వనము పూజలు చేశారు. 10గంటలకు యాగశాలలో ఆయురారోగ్య ఐశ్వర్యాది ఐహిక ఫలములను ప్రసాదించు శ్రీసుదర్శనేష్టి యాగం పూజలను స్థానాచార్యులు వేదాంతం వరదరాజాచార్యులు, పూజారి వేణుగోపాలాచార్యులు, యాజ్ఞికులు నంద్యాల అనంత శేషరాజన్ బృందం వేదమంత్రోశ్చరణల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు అశ్వవాహనంపై లక్ష్మీనారాయణ, పల్లకీలో లక్ష్మీదేవి విగ్రహాలను పట్టణ వీధులలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి ఇంటి నుంచి పట్టువస్త్రాలతోపాటు తలంబ్రాలను మేళతాళాల నడుమ వచ్చి, ఆలయ ప్రాంగణంలో సంప్రదాయ రీతిలో ఎదుర్కోలు కార్యక్రమం భక్తులను అలరించింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనారాయణ సేవా సమితి ప్రతినిధులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ మండపంపై స్వామివారి తిరుకల్యాణోత్సవ వేడుకలను కమనీయంగా జరిపించారు. భారీ ఎత్తున హాజరైన భక్తులు లక్ష్మీనారాయణస్వామి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మేరుగు నరేష్‌గౌడ్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, పుల్లూరు భాస్కర్ గౌడ్, చిక్కుల నరేష్, బాషబోయిన ఐలయ్య ఏర్పాట్లు చేశారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జేఎన్‌టీయూ యూనివర్సిటీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ రెసిడెన్షియల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం గురువారం తెలిపారు. ఈఈఈ, మెకానిక్, సీఎస్ఈ కంప్యూటర్ సైన్స్, ఈసీఈ కంప్యూటర్ డేటా సైన్స్, సివిల్‌లో ప్రతి బ్రాంచ్‌లో 60సీట్లకు అవకాశం ఉందన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నర్సింహులపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నర్సింహులపేటలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో వసతులను గురువారం ఎన్నికల సెక్టార్ అధికారి రామకృష్ణ పరిశీలించారు. మండలంలో 1,177 ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఈనెల 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి 4 గంటల వరకు పట్టభద్రుల పోలింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చప్పిడి నాగరాజు, ఆర్ఐ సైదులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మండల కేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల సెక్టర్ అధికారి(జిల్లా ఉపాధి కల్పన అధికారి) రామకృష్ణ గురువారం పరిశీలించారు. ఓట్లు వేసేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

కురవి: జీలుగ, పెసర విత్తనాలను మండల కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస రైతు సేవా కేంద్రం ద్వారా గురువారం మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆగ్రోస్ సీఈఓ రాధాకృష్ణ, ఏఈఓ పున్నమి, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

డోర్నకల్: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చారు. సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం 5 ఎంవీఏ స్థాయి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా అధికలోడుతో పలు సమస్యలు ఉత్పన్నమవుతుండడంతో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. రెండు ప్రొక్లెయినర్ యంత్రాలతో సుమారు ఐదు గంటలు శ్రమించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సబ్‌స్టేషన్‌లో అమర్చారు. ఇక్కడ తొలగించిన 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను మన్నెగూడెం సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కిరణ్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్‌లు



నెల్లికుదురు: శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్‌ను మండలంలోని నైనాల గ్రామ ముదిరాజ్ పెద్దలు, మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ఉపాధ్యక్షుడు రమేష్ గురువారం హన్మకొండలోని ఆయన నివాసంలో కలిశారు. మండల కేంద్రంలో చేపల మార్కెట్ ఏర్పాటు తదితర అంశాలపై చర్య తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బత్తిని వెంకన్న, నారబోయిన వెంకన్న, తోట యాకయ్య, తోట నర్సయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

గంగారం: బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ అన్నారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సువర్ణపాక సమ్మక్క కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. తొలుత సమ్మక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య, జగ్గారావు, బాలకృష్ణ, సమ్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బైరు పూలమ్మ అనే మహిళ మృతిచెందింది. ఈమేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి సంతాపం తెలిపి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు, ఉదయ్‌చందర్, బండారు దయాకర్, నూకల వెంకటేశ్వర్లు, బానోతు వెంకన్న, సారంగం, పరిపూర్ణచారి, రమేష్ పాల్గొన్నారు.

మంత్రి జన్మదిన వేడుకలు

డోర్నకల్: స్థానిక మెయిన్ రోడ్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలా సునీల్‌కుమార్‌జైన్, దాసరి నానియాదవ్, మల్లం అనిల్, పాషా, విజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో జీవాల మృత్యువాత



గార్లలో ఇటీవల మృతి చెందిన గేదె (ఫైల్)



గండి గ్రామంలో ఇటీవల మృతిచెందిన గేదెలు (ఫైల్)

గార్ల: భూమికి తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మ్‌ల నిర్మాణం, వేలాడే విద్యుత్ తీగలతో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుదాఘాతానికి పశువులు, గేదెలు మృతిచెందిన రైతులకు విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా నిత్యం మూగజీవాలు మృతిచెందుతున్నా.. అధికారుల్లో చలనం లేదన్నారు. గాలి దుమారం, అకాల వర్షాలు వచ్చిన సమయంలో స్థానిక విద్యుత్ సిబ్బంది ఆయా గ్రామాల్లో, పంటపొలాల్లో విద్యుత్ లైన్లు తెగిన వెంటనే లైన్లు మరమ్మతులు చేయాలన్నారు. విద్యుత్ సిబ్బంది స్థానికంగా ఉండకుండా సుదూర పట్టణాల నుంచి రాకపోకలు సాగించడం ద్వారా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రబీ పంటలు పూర్తయిన వెంటనే పంటపొలాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తే ఇలాంటి సంఘటనలను నివారించవచ్చన్నారు. ఇట్టి విషయంపై విద్యుత్ ఏఈ మహేంద్రబాబును వివరణ కోరగా వర్షాలు పడిన సమయంతో రైతులు పశువులను మేతకు వదిలేటప్పుడు పశువుల కాపరిని పంపించుకోవాలని సూచించారు.

'దోపిడీ ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుంది'

దంతాలపల్లి: దేశంలోనే కాదు ప్రపంచంలో దోపిడీ ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, ప్రజాపంథా కేంద్ర కమిటీ సభ్యులు రామచందర్ అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. నేడు దేశంలో కొనసాగుతున్న సామ్రాజ్యవాద కార్పొరేట్ పెట్టుబడిదారి దోపిడీని, భూస్వామ్య అవశేషాలను ఓడించడానికి ప్రజాయుద్ధ పథంలో వర్గపోరాటాలను తీవ్రం చేయాలని కోరారు. అందుకు శ్రమ జీవులను ఐక్యంచేసి ఈ వ్యవస్థ మార్పుతోనే వారి జీవితాలు బాగు పడతాయని అర్థం అయ్యేలా బోధించాలన్నారు. కార్యక్రమంలో మరో కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చంద్రన్న, జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు ఊడుగుల రాములు, ముంజపల్లి వీరన్న, ప్రభాకర్, జగ్గన్న, రాజేశ్వరరెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.